TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-154 | పేజీలు:-4 | శనివారం 16-05-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

## ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు, కానీ!



- కేసీఆర్ సీఎం అయ్యాక ప్రజలకు దూరమయ్యారన్న కవిత
- పరిపాలన కాలంలో కేసీఆర్ యంత్రంలా పని చేశారని వ్యాఖ్య
- అందుకే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదన్న కవిత

ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప వ్యక్తి అని,- మిగతా 2 లో

## 2034లో దేశ రాజకీయాల్లోకి
# అప్పటి వరకు నేనే సీఎం




తెలంగాణకు 2034 వరకు ముఖ్యమంత్రిగా ఉంటానని.. ఆ తర్వాత దేశ రాజకీయాల్లోకి వెళ్తానని సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ మీడియా సంస్థ ఏర్పాటు చేసిన కాంక్లేవ్‌లో ఆయన రాజకీయ, పాలనాపరమైన అంశాలపై సంచలన విషయాలు పంచుకున్నారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల అపారమైన విశ్వాసం ఉందని, అధిష్ఠానంతో తనకు ఎంతో చొరవ ఉందని తెలిపారు. టీడీపీ వీడే సమయంలోనూ చంద్రబాబును కలిసి స్వయంగా చెప్పి వచ్చానని, పార్టీలు మారినా నాయకుల మధ్య ఆ తరహా సత్సంబంధాలు ఉండటం అరుదని ఆయన గుర్తుచేసుకున్నారు. నేటి జనం స్విగ్గీ పాలిటిక్స్ కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమని, కానీ వికారాబాద్ సభలో ప్రధాని బాధ్యతలు చేపట్టాలని తానే ఆయనను ఒప్పించానని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థి రాహులేనని ధీమా వ్యక్తం చేశారు. 2034 వరకు సీఎంగా ఉంటూ పది శాతం జీడీపీని దేశానికి అందిస్తానని, ఆ తర్వాత తన అనుభవాన్ని దేశానికి పంచుతానని రేవంత్ స్పష్టం చేశారు.

**కొడుకును పోలీసులకు అప్పగించాలి**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడి పోక్సో కేసు వ్యవహారంపై సీఎం రేవంత్

## పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు




**నిజం న్యూస్ హైదరాబాద్ మే 15:** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్పై సగటున రూ.3, డీజిల్పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్లో పెట్రోల్పై రూ3.29, డీజిల్పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి.

## బ్రిటన్ తొలి బిలియనీర్ క్రీడాకారుడిగా డేవిడ్ బెక్‌హామ్

- సంపద విలువ రూ. 12,800 కోట్లు!
- బ్రిటన్‌లో తొలి బిలియనీర్ క్రీడాకారుడిగా డేవిడ్ బెక్‌హామ్
- భార్య విక్టోరియాతో కలిసి రూ. 12,800 కోట్లకు చేరిన సంపద
- ఇంటర్ మయామి క్లబ్, బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు ప్రధాన ఆదాయ వనరులు
- మాంచెస్టర్ యునైటెడ్ సహ యజమాని జిమ్ రాట్‌క్లిఫ్ సంపదలో భారీ తగ్గుదల
- సండే టైమ్స్ స్పోర్ట్స్ రిచ్ లిస్ట్‌లో వెల్లడైన వివరాలు



ప్రపంచ ఫుట్‌బాల్ లెజెండ్, మాజీ మాంచెస్టర్ యునైటెడ్ స్టార్ డేవిడ్ బెక్‌హామ్ అరుదైన ఘనత సాధించాడు. బ్రిటన్‌లో తొలి బిలియనీర్ క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించాడు. సండే టైమ్స్ 2026 రిచ్ లిస్ట్ ప్రకారం, బెక్‌హామ్, ఆయన భార్య విక్టోరియా సంయుక్త సంపద భారత కరెన్సీలో సుమారు - మిగతా 2 లో

## అమెరికా సెనేటర్ నోట హైదరాబాద్ చిలుకూరు టెంపుల్ మాట

- భారతీయులకు వీసాలు లభించడంపై ఎరిక్ స్మిత్ అక్కసు
- చిలుకూరు గుడిని 'వీసా కార్టెల్' అంటూ దుర్భాషలు
- అమెరికన్ల ఉద్యోగాలను భారతీయులు పొందుతున్నారంటూ అవగాహనారాహిత్య వ్యాఖ్యలు



అమెరికాలో భారతీయుల ఉద్యోగాలు, వీసాలపై అక్కడి సెనేటర్ ఎరిక్ స్మిత్ అక్కసు వెళ్లగక్కారు. పెద్ద టెక్ కంపెనీలు అమెరికా ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో ఇండియన్స్‌ను నియమించుకుంటున్నాయని ఆరోపించారు. హెచ్-1బీ, ఎల్-1, ఎఫ్-1 వీసాల వల్ల అమెరికా మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా- మిగతా 2 లో

## తమిళనాడు ఎన్నికల్లో విదేశీయుల దొంగ ఓట్లు

ఆపై పరారీకి యత్నం... అరెస్ట్!



- తమిళనాడు ఎన్నికల్లో దొంగ ఓట్లు వేసిన విదేశీయులు
- సుమారు 25 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపిన పోలీసులు
- వేలికి ఉన్న సిరా గుర్తుతో ఎయిర్‌పోర్టులో పట్టుబడ్డ వైనం
- అరెస్టయిన వారిలో శ్రీలంక, బ్రిటిష్, కెనడా పౌరులు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నకిలీ గుర్తింపు పత్రాలు ఉపయోగించి ఓటు హక్కు వినియోగించుకున్నారన్న ఆరోపణలపై - మిగతా 2 లో

## దిగుమతి సుంకం తొలగిస్తేనే
# టెక్స్‌టైల్ గట్టెక్కేది

ప్రధాని మోదీకి సీఎం విజయ్ లేఖ

- పత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేయాలంటూ ప్రధానికి సీఎం విజయ్ లేఖ
- టెక్స్‌టైల్ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉందని ఆవేదన
- ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతోందని ఆందోళన
- గత రెండు నెలల్లో పత్తి ధర 25 శాతం పెరిగిందని లేఖలో ప్రస్తావన
- సుంకం రద్దు చేస్తేనే పరిశ్రమ నిలదొక్కుకుంటుందని వెల్లడి




తమిళనాడులోని టెక్స్‌టైల్ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉందని, దానిని ఆదుకునేందుకు పత్తిపై ఉన్న 11 శాతం దిగుమతి సుంకాన్ని తక్షణమే తొలగించాలని ముఖ్యమంత్రి విజయ్..

## యూఏఈ పర్యటనలో ప్రధాని మోదీ

కీలక ఒప్పందాలపై సంతకాలు



- పశ్చిమాసియా సంక్షోభం వేళ యూఏఈలో ప్రధాని మోదీ పర్యటన
- ఇంధన భద్రత, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే ప్రధాన లక్ష్యం
- ఎల్‌పీజీ, పెట్రోలియం నిల్వలపై కుదిరిన కీలక ఒప్పందాలు
- భారత్‌లో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు యూఏఈ అంగీకారం
- గుజరాత్‌లో షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు మరో కీలక ఎంఓయూ

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ఇంధన సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో - మిగతా 2 లో

## పోలవరం నిర్వాసితులకు
# రూ.306 కోట్ల ప్యాకేజీ

ఇళ్ల తాళాలు అందించిన సీఎం చంద్రబాబు

- పోలవరంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని తెలిపిన సీఎం చంద్రబాబు
- నిర్వాసితులకు నాలుగో విడతగా రూ.306 కోట్ల పరిహారం విడుదల
- 23 నెలల్లో నిర్వాసితులకు రూ.2,250 కోట్లు చెల్లించిన కూటమి ప్రభుత్వం
- చంద్రబాబు సీఎం అయ్యాకే తమకు న్యాయం జరుగుతోందన్న నిర్వాసితులు
- 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ




పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై తమ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందని, నిర్వాసితుల సంక్షేమం పట్ల ప్రత్యేక అభిమానంతో ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పుట్టపర్తి పర్యటన ముగించుకుని అమరావతి వచ్చిన ఆయన, శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పోలవరం

## పొరుగు రాష్ట్రం నేతతో నన్ను పోల్చవద్దు



- అండగా ఉంటానన్న నేతలు ఆ రోజు పారిపోయారు: పవన్ కల్యాణ్
- మంగళగిరిలో జనసేన ఉద్యమి సమావేశం
- శస్త్రచికిత్స తర్వాత తొలిసారిగా సమావేశానికి విచ్చేసిన పవన్
- జనసేన క్యాడర్ కు దిశానిర్దేశం
- 2019లో తనను రెండు చోట్లా ఓడించారని వెల్లడి

ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత కోలుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలోని - మిగతా 2 లో

## వాళ్లు ముగ్గురు 75 ఏళ్ల కుర్రాళ్లు

వాళ్లది పవర్ ఫుల్ కాంబో: మంత్రి నారా లోకేష్



- పుట్టపర్తిలో ఏఎంసీఏ స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్‌కు భూమిపూజ
- మోదీ, రాజ్ నాథ్, చంద్రబాబు 75 ఏళ్ల కుర్రాళ్లు అంటూ లోకేష్ ప్రశంసలు
- వారిలో 25 ఏళ్ల యువకులు ఉన్నారని, వారి స్పీడ్ తట్టుకోలేమన్న లోకేష్
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఐరన్ మ్యాన్‌గా అభివర్ణన

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు.. - మిగతా 2 లో

## వాళ్లు ముగ్గురు 75 ఏళ్ల కుర్రాళ్లు

మొదటిపేజీ తరువాయి – వీరంతా 75 ఏళ్ల కుర్రాళ్లు అంటూ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వారి వయసు 75 ఏళ్లయినా, వారిలో 25 ఏళ్ల యువకులు ఉన్నారని, వారి స్పీడ్ చూస్తుంటే తనకు ఆశ్చర్యం వేస్తుందని అన్నారు. ఈ ముగ్గురి వేగాన్ని తట్టుకోవడం ఎవరి వల్లా కాదని లోకేష్ వ్యాఖ్యానించారు. వీరిది పవర్ ఫుల్ కాంబినేషన్ అని కొనియాడారు. పుట్టపర్తిలో అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో కలిసి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్ర మారబోతోందని లోకేష్ అన్నారు. రక్షణ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు రానున్నాయని, యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, పాకిస్థాన్‌కు గట్టి జవాబిచ్చిన 'ఆపరేషన్ సిందూర్'ను గుర్తుచేస్తూ, దాని వెనుక ఉన్న అసలైన శక్తి, ఐరన్ మ్యాన్ కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ అని లోకేష్ ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా ఏపీ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ం

## ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు, కానీ!

మొదటిపేజీ తరువాయి – అందులో ఎవరికీ అనుమానాలు లేవని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు క్రమంగా దూరమయ్యారని అన్నారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పరిపాలన కాలంలో కేసీఆర్ ఒక యంత్రంలా మాత్రమే పనిచేశారని అన్నారు. అందువల్లే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన ఎంతో కఠినంగా ఉండేవారని అన్నారు. కన్నబిడ్డగా సమస్యలు చెప్పుకునే అవకాశం తనకే ఇవ్వలేదని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకే అందుబాటులో లేని వ్యక్తి, ఇక సామాన్య ప్రజల కష్టాలను ఎలా వింటారని ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడి నుంచి ఒక యంత్రం లాంటి ముఖ్యమంత్రిగా మారిన తీరే ప్రస్తుత రాజకీయ పరిణామాలకు కారణమని అన్నారు.

## నా పేరు వాడొద్దు

మొదటిపేజీ తరువాయి – భవిష్యత్తులో తన పేరును వాడకుండా చూడాలని పిటిషన్ వేశారు. అలాగే తన పేరుతో ఇప్పటి వరకు వాడిన వీడియోలను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కుమారుడిపై నమోదైన కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కాబట్టి ఈ వివాదంలో తన పేరును ఎక్కడా ఉపయోగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా, బండి భగీరథ్ కేసులో బాలిక వివరాలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంపై కేసు నమోదైంది. బాలిక ఫొటోలు, వీడియోలు, తల్లిదండ్రుల వివరాల ప్రసారంపై కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు సోషల్ మీడియా ఖాతాల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపారు.

## బ్రిటన్ తొలి బిలియనీర్ క్రీడాకారుడిగా డేవిడ్ బెక్‌హామ్

మొదటిపేజీ తరువాయి – రూ. 12,800 కోట్లకు (1.185 బిలియన్ పౌండ్లు) చేరింది. దీంతో క్రీడా రంగంలో అత్యంత ధనవంతుల జాబితాలో ఈ జంట రెండో స్థానంలో నిలిచింది. అమెరికా మేజర్ లీగ్ సాకర్‌లో అత్యంత విలువైన క్లబ్‌గా పేరొందిన ఇంటర్ మయామికి బెక్‌హామ్ సహ యజమానిగా ఉన్నాడు. ఈ క్లబ్ విలువ సుమారు రూ. 12,000 కోట్లుగా (1.45 బిలియన్ డాలర్లు) ఉంది. దీంతో పాటు అడిడాస్, హ్యూగో బాస్ వంటి అంతర్జాతీయ బ్రాండ్లకు అంబాసడర్‌గా వ్యవహరిస్తూ భారీగా ఆర్జిస్తున్నారు. ఆయన భార్య విక్టోరియా బెక్హామ్ ఒకప్పటి స్పైస్ గాళ్స్ మ్యూజిక్ బ్యాండ్ సభ్యురాలు. ఆమె తన ఫ్యాషన్ లేబుల్ ద్వారా భారీగా సంపదను ఆర్జించారు. ఒకవైపు బెక్‌హామ్ సంపద పెరుగుతుంటే, మరోవైపు మాంచెస్టర్ యునైటెడ్ సహ యజమాని సర్ జిమ్ రాట్‌క్లిఫ్ ఆస్తి గతేడాది కాలంలో గణనీయంగా తగ్గింది. ఆయన సంపద సుమారు రూ. 20,000 కోట్లు (1.85 బిలియన్ పౌండ్లు) తగ్గి, దాదాపు రూ. 1.64 లక్షల కోట్లకు చేరింది. ఆయనకు చెందిన ఇనియోస్ పెట్రోకెమికల్స్ కంపెనీ నష్టాల పాలవడం ఇందుకు ప్రధాన కారణంగా తేలింది. ఈ స్పోర్ట్స్ రిచ్ లిస్ట్‌లో ఫార్ములా వన్ మాజీ చీఫ్ బెర్నీ ఎక్లెస్టోన్ కుటుంబం రూ. 21,600 కోట్ల సంపదతో అగ్రస్థానంలో ఉంది. ఇతర ప్రముఖులలో ఎఫ్1 ఛాంపియన్ లూయిస్ హామిల్టన్ (రూ. 4,698 కోట్లు), గోల్ఫ్ స్టార్ రోరీ మెక్‌ఇల్రాయ్ (రూ. 3,510 కోట్లు), ఇంగ్లాండ్ ఫుట్‌బాల్ కెప్టెన్ హ్యారీ కేన్ (రూ. 1,188 కోట్లు) ఉన్నారు.

## అమెరికా సెనేటర్ నోట హైదరాబాద్ చిలుకూరు టెంపుల్ మాట

మొదటిపేజీ తరువాయి – నష్టపోతున్నారంటూ 'ఎక్స్' వేదికగా అసంబద్ధమైన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని ప్రసిద్ధ చిలుకూరు బాలాజీ దేవాలయాన్నీ ఎరిక్ ప్రస్తావించారు. వీసాల కోసం వేలాది మంది ఇక్కడ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని గుర్తుచేశారు. పాస్‌పోర్టులకు పూజలు చేయించి మరీ వీసాలు పొందుతున్నారని, దీన్ని 'వీసా కార్టెల్' వ్యవస్థ అంటూ భక్తుల విశ్వాసాన్ని అవహేళన చేసే ప్రయత్నం చేశారు. అమెరికన్లు చెల్లించే ట్యాక్స్‌లతో విదేశీ విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తున్నాయంటూ ఎరిక్ తన అవగాహనారాహిత్యాన్ని బయట పెట్టుకున్నారు. వీరంతా చదువు పూర్తయ్యాక గ్రీన్ కార్డుతో స్థిరపడుతున్నారని అక్కసు వెళ్లగక్కారు. దీనివల్ల అమెరికా గ్రాడ్యుయేట్లు ఉద్యోగాలు పొందలేకపోతున్నారంటూ పొంతనలేని ఆరోపణలు చేశారు. ఉద్యోగాల్లో మెరిట్ పక్కనపెట్టి ఇండియన్స్‌కే ఉద్యోగాలు ఇస్తున్నారంటూ అక్కడి కంపెనీలపై ఎరిక్ మండిపడ్డారు. మరోవైపు ఇంటర్వ్యూ ప్రశ్నలను భారతీయులు ఒకరికొకరు షేర్ చేసుకుంటున్నారని చెప్పుకొచ్చారు. సదరన్ మెథడిస్ట్ యూనివర్సిటీలో అమెరికన్ ప్రొఫెసర్‌ను కాదని, భారతీయుడికే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపిస్తూ ఇటీవల కోర్టుకు వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు.

## యూఏఈ పర్యటనలో ప్రధాని మోదీ



మొదటిపేజీ తరువాయి – పర్యటిస్తున్నారు. దేశంలో నాలుగేళ్ల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన తరుణంలోనే ఈ పర్యటన జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్ ఇంధన భద్రతను పటిష్ఠం చేసుకోవడం, ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. అబుదాబిలో యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన భద్రత, రక్షణ సహకారం, ప్రజా సంబంధాలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ), వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలకు సంబంధించి రెండు ముఖ్యమైన అవగాహన ఒప్పందాలపై (ఎంఓయూ) సంతకాలు జరిగాయి. వీటితో పాటు ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌పైనా అంగీకారానికి వచ్చారు. గుజరాత్‌లోని ద్వారక జిల్లా వడినార్‌లో షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించిన ఎంఓయూపైనా సంతకాలు చేశారు. ఈ ఒప్పందాలతో పాటు భారత మౌలిక సదుపాయాలు, ఆర్‌బీఎల్ బ్యాంక్, సమ్మాన్ క్యాపిటల్‌లో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు యూఏఈ ప్రకటించింది. ఇది భారత్ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తుందని భావిస్తున్నారు. ఈ పర్యటన సందర్భంగా అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో యూఏఈపై ఇరాన్ జరిపిన దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. గల్ఫ్ ప్రాంతంలో భారత్‌కు కీలక భాగస్వామిగా ఉన్న యూఏఈతో ఈ తాజా ఒప్పందాలు వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను కొత్త శిఖరాలకు చేర్చనున్నాయి. సుమారు 45 లక్షల మందికి పైగా భారతీయులు నివసిస్తున్న యూఏఈలో వారి సంక్షేమం గురించి కూడా ఈ పర్యటనలో చర్చకు వచ్చింది. ప్రస్తుత సంక్షోభ సమయంలోనూ యూఏఈ భారత్‌కు అత్యంత నమ్మకమైన ఇంధన భాగస్వామిగా కొనసాగుతుండటం గమనార్హం.

# పోలవరం నిర్వాసితులకు రూ.306 కోట్ల ప్యాకేజీ

మొదటిపేజీ తరువాయి నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు నాలుగో విడతగా రూ.306.61 కోట్ల పరిహారం, పునరావాస (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీని అందించారు. పలువురు లబ్ధిదారులకు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్ల తాళాలను అందజేశారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతి రోజున నిర్వాసితులకు పరిహారం అందించడం సంతోషంగా ఉందని సీఎం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 23 నెలల్లో 29,936 మంది నిర్వాసితులకు సుమారు రూ.2,250 కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. "ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు నష్టపోకూడదనేదే నా ఆలోచన. అందుకే ప్రత్యేకంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేశాం. 2027లో జరిగే పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం" అని చంద్రబాబు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్లే పోలవరం ప్రాజెక్టు ఆలస్యమైందని, డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని ఆయన విమర్శించారు. "గత పాలకులు కాంట్రాక్టర్లను మార్చి, అధికారులను మార్చి ప్రాజెక్టును నాశనం చేశారు. మేం మళ్లీ ప్రాజెక్టును గాడిలో పెట్టాం. నిర్వాసితుల్లో ఒక్కరికి కూడా అన్యాయం జరగనివ్వను" అని భరోసా ఇచ్చారు. టెక్నాలజీని ఉపయోగించి గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబ ఆదాయం పెంచుతామని, రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాట్లాడిన నిర్వాసితులు, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకే తమ సమస్యల పరిష్కారంపై నమ్మకం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పరిహారంపై ఆశలు వదులుకున్నామని, వరదల సమయంలో కనీస సహాయం కూడా అందలేదని వారు ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే తమకు మంచి రోజులు వచ్చాయని, పండుగల సందర్భంగా సైతం పరిహారం అందిస్తుండటం సంతోషంగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, మిరియాల శిరీషా దేవి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పొరుగు రాష్ట్రం నేతతో నన్ను పోల్చవద్దు

మొదటిపేజీ తరువాయి – పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన 'జనసేన ఉద్యమి' సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, గడిచిన కొన్నేళ్లలో తాను ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లతో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తొలిసారిగా వెల్లడించారు. గత ఎన్నికల్లో విజయం తన ఒక్కడిది కాదని, క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేసిన ప్రతి జనసైనికుడు, వీరమహిళ, ఉద్యమిదేనని స్పష్టం చేశారు. పార్టీ భవిష్యత్ నిర్మాణం, భావజాల వ్యాప్తి, ప్రభుత్వంలో జనసేన పాత్ర వంటి కీలక అంశాలపై కార్యకర్తలకు సుదీర్ఘంగా వివరించారు.

### ఆరోగ్య సమస్యలపై తొలిసారిగా స్పందన

గత కొన్నేళ్లుగా తాను తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పోరాటం చేశానని పవన్ కల్యాణ్ వెల్లడించారు. "ఎన్నికలకు ఏడాది ముందు నుంచి ప్రచారంలో తిరగడం, కరోనా సమయంలో లంగ్ ఇన్ఫెక్షన్ రావడంతో నా ఆరోగ్యం దెబ్బతింది. ఆ ఇన్ఫెక్షన్ ఇప్పటికీ పూర్తిగా తగ్గలేదు. దుమ్ము, ధూళిలో తిరగడం వల్ల సైనస్ ప్రాంతంలో దుమ్ము పేరుకుపోయి గట్టిపడిపోయింది. దీనివల్ల నా గొంతు కూడా చాలాకాలం ఇబ్బంది పెట్టింది. ఒక దశలో కంటి చూపులో కూడా తేడా వచ్చింది. భీమవరంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకుని హైదరాబాద్ వెళ్లి చికిత్స తీసుకోవడానికి నెల రోజులు పట్టింది," అని వివరించారు. అభిమానుల ప్రేమ వల్లే తన భుజాలకు గాయాలయ్యాయని పవన్ భావోద్వేగంతో తెలిపారు. "నా రెండు భుజాల్లో కండరాలు తెగిపోయాయి (టేర్). ఎలా జరిగిందని వైద్యులు అడిగితే, మా వాళ్లు ప్రేమతో లాగేశారు అని చెప్పాను. షేక్ హ్యాండ్ ఇచ్చినప్పుడు అభిమానులు ప్రేమతో గట్టిగా లాగడంతో కండరాలు తెగిపోయాయి. మీ ప్రేమతో తెగిన కండరాలను మళ్లీ మీ ప్రేమే బాగుచేస్తుంది," అని అన్నారు. వెన్నెముకలో కూడా 10 నుంచి 11 చోట్ల కంప్రెషన్స్ ఉన్నాయని, క్రీడా నేపథ్యం ఉండటంతో ఆ నొప్పిని తట్టుకోగలుగుతున్నానని తెలిపారు. "లోపల ఎంత నొప్పి ఉందో నాకే తెలియదు. నా పెయిన్ టాలరెన్స్ చాలా ఎక్కువ. అయినా మీ అందరి ఆశీస్సులతో నేను బాగుంటాను" అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

### నన్ను ఇతరులతో పోల్చవద్దు

తమిళనాడులో విజయ్ సాధించిన విజయంతో తనను పోల్చవద్దని పవన్ కల్యాణ్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. "పొరుగు రాష్ట్ర నేతలా మీరు కూడా చేసి ఉండాల్సింది అని చాలామంది సందేశాలు పంపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు వేరు. అదే పని 2019లో చేస్తే రెండుచోట్లా ఓడించారు కదా అండగా ఉంటానన్న నాయకులంతా ఆ రోజు పారిపోయారు. నాకు పదవి ముఖ్యం అనుకుంటే 2008లోనే ఎంపీగా పోటీ చేసేవాడిని, 2014లోనూ అవకాశం వచ్చింది. కానీ నాకు పార్టీని నిర్మించడం ముఖ్యం" అని స్పష్టం చేశారు.

### భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత

రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై పవన్ నాలుగు కీలక అంశాలను ప్రస్తావించారు.

1.పార్టీ నిర్మాణం: "ఒక పుష్కర కాలం (12 సంవత్సరాలు) తర్వాత పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేయాల్సిన సమయం వచ్చింది. ఇన్నాళ్లూ సిద్ధాంతాన్ని నమ్మి, ఎన్నో ఒడిదొడుకులను తట్టుకుని నిలబడిన మీరే ఈ పార్టీకి పునాది. మిమ్మల్ని కేంద్రంగా చేసుకునే కొత్త నిర్మాణం ఉంటుంది" అని తెలిపారు.

2.భావజాలం: జనసేన ఏడు సిద్ధాంతాలను కార్యకర్తలు క్షుణ్ణంగా అర్థం చేసుకుని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

3.పొత్తు ధర్మం, భవిష్యత్ మార్గం: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వంలో జనసేన పాత్ర ఎలా ఉండబోతోందో వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలపైనా స్పష్టత ఇచ్చారు.

4.జాతీయ స్థాయిలో పాత్ర: ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా జనసేన ఎలా ముందుకు సాగాలో, ఇతర రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలను ఎలా సమన్వయం చేసుకోవాలో వివరిస్తానని చెప్పారు.

### క్షేత్రస్థాయి నాయకులే పార్టీ బలం

పార్టీ బలం తాను కాదని, క్షేత్రస్థాయిలోని కార్యకర్తలేనని పవన్ పునరుద్ఘాటించారు. "ఒకప్పుడు 150 మందితో మొదలైన పార్టీలో ఇప్పుడు 21.5 లక్షల మంది జనసైనికులు, వీరమహిళలు ఉన్నారు. మిమ్మల్ని 'సాధకులు' అని పిలవాలనుకుంటున్నాను. లక్ష్యాన్ని సాధించేవారే సాధకులు. 'మా ఊరికి నేనే పవన్ కల్యాణ్' అని వైజాగ్‌లో ఒక జనసైనికుడు చెప్పినప్పుడు, నేను కోరుకున్న పార్టీ నిర్మాణం ఇదే అనిపించింది," అని అన్నారు. విజయనగరంలో 'మంగళవారం హుసేన్', నక్సలిజం వీడి ఉపసర్పంచ్ అయిన అరకు యువకుడు బాబూరావు వంటి ఎందరో స్ఫూర్తిదాయక కార్యకర్తలే జనసేన నిజమైన బలమని కొనియాడారు. "ఈ విజయం ఉమ్మడి పోరాటం వల్లే సాధ్యమైంది. ఈ గెలుపులో నాకు ఎంత వాటా ఉందో, మీ అందరికీ అంతే సమానమైన వాటా ఉంది. మీరంతా లేకపోతే నేను ఎవరిని ప్రేమిస్తాను? నన్ను వీడని నా జనసైనికులు, వీరమహిళలే నా బలం" అంటూ పవన్ కల్యాణ్ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి కూడా జనసేన ప్రతినిధులు హాజరయ్యారు.

# దిగుమతి సుంకం తొలగిస్తేనే టెక్స్‌టైల్ గట్టెక్కేది

మొదటిపేజీ తరువాయి – ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు ఆయన ప్రధానికి ఒక లేఖ రాశారు. పత్తి, నూలు ధరలు విపరీతంగా పెరగడంతో రాష్ట్రంలోని టెక్స్‌టైల్ రంగం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "తమిళనాడు, దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్, దుస్తుల ఎగుమతి రాష్ట్రం. ముఖ్యంగా గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది మహిళలు ఈ రంగంపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. అయితే, ఇటీవల పత్తి, నూలు ధరలు పెరగడంతో పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. దేశీయంగా పత్తి ఉత్పత్తి కొరత, ట్రేడింగ్ కార్యకలాపాలు పెరగడమే ఇందుకు కారణం" అని విజయ్ తన లేఖలో పేర్కొన్నారు.ధరల పెరుగుదల వివరాలను ఆయన తన లేఖలో స్పష్టంగా తెలిపారు. "గత రెండు నెలల్లోనే పత్తి ధర 25 శాతం పెరిగింది. ఒక క్యాండీ (సుమారు 356 కిలోలు) ధర రూ. 54,700 నుంచి రూ. 67,700కు చేరింది. అదే సమయంలో నూలు ధర కిలోకు రూ. 301 నుంచి రూ. 330కి పెరిగింది. ఈ పరిస్థితుల్లో ముడిసరుకు కోసం దిగుమతులే ఏకైక మార్గం. అయితే, పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం ఉండటం అవరోధంగా మారింది" అని విజయ్ వివరించారు. వ్యవసాయం తర్వాత రాష్ట్రంలో అత్యధిక ఉపాధి కల్పిస్తున్న రంగం టెక్స్‌టైల్ అని గుర్తుచేసిన విజయ్, ఈ పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. "దిగుమతి సుంకాన్ని సున్నా శాతానికి తగ్గిస్తే, పరిశ్రమకు అవసరమైన ముడిసరుకు అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల పెరుగుతున్న ఎగుమతి ఆర్డర్లను అందుకోవడమే కాకుండా ప్రపంచ మార్కెట్లో మన పరిశ్రమ పోటీతత్వాన్ని నిలబెట్టుకోగలుగుతుంది. తద్వారా లక్షలాది ఉద్యోగాలను కాపాడవచ్చు" అని ఆయన అభ్యర్థించారు. ఈ విషయంలో కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని సీఎం విజయ్ విజ్ఞప్తి చేశారు.

# 2034లో దేశ రాజకీయాల్లోకి అప్పటి వరకు నేనే సీఎం

మొదటిపేజీ తరువాయి – సీరియస్‌గా స్పందించారు. ఈ కేసులో పోలీసులు పారదర్శకంగా వ్యవహరించారన్నారు. ఎనిమిదో తేదీన బాలిక తల్లి ఫిర్యాదు చేయగా, తొమ్మిదిన విచారణ జరిపి సెక్షన్లు మార్చామని, ప్రధాని బందోబస్తు కారణంగా పదకొండున నోటీసులు ఇచ్చామన్నారు. ఇందులో రాజకీయ కక్షసాధింపు ఏమాత్రం లేదని, మైనర్ బాలిక భవిష్యత్తుకు సంబంధించిన అంశం కాబట్టే చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తున్నామని స్పష్టం చేశారు. సినిమా వాళ్లైనా, రాజకీయ నేతలైనా చట్టం ముందు ఎవరికీ మినహాయింపులు ఉండవన్నారు. ఆ అమ్మాయికి రెండు బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయని, వాటన్నింటినీ పోలీసులు లోతుగా విచారించాల్సి ఉందన్నారు. బండి సంజయ్‌కు, బీఆర్ఎస్‌కు ఎక్కడ చెడిందో తనకు తెలియదని చురకలంటించారు. తప్పు చేసిన వాళ్లు శిక్ష నుంచి తప్పించుకోలేరని, బండి సంజయ్ నైతికంగా బాధ్యత వహించి పారిపోకుండా తన కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించి విచారణ ఎదుర్కోవాలని రేవంత్ సూచించారు.

### అభివృద్ధి కోసం కేంద్రంతో సహకారం

రాష్ట్ర అభివృద్ధి సాధనలో కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. అధికారిక వేదికలపైనే తాను ప్రధాని మోదీతో మాట్లాడానని, కేంద్రంతో కలిసి రమ్మని ప్రధాని కోరారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఆనాటి సీఎం కేసీఆర్ ఏనాడూ కేంద్రంతో కలిసి రాలేదన్నారు. సోనియా గాంధీ లేకుంటే వెయ్యేళ్లు అయినా తెలంగాణ వచ్చేది కాదని, నిబద్ధతతో పనిచేస్తున్నందుకే అధిష్ఠానం తనకు ఈ స్థాయి అవకాశాలు ఇచ్చిందన్నారు. కష్టపడ్డ సామాన్య కార్యకర్తలకు, ఉద్యమకారులకు పదవులు దక్కేలా చూస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇంట్లో ఉండే వెడ్మ బొజ్జు, రూపాయి లేని మందుల సామేల్ లాంటి సామాన్యులకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నామన్నారు. చాకలి ఐలమ్మ, శ్రీకాంతాచారి కుటుంబాలకు పదవులు ఇచ్చామన్నారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా చేశామని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేశామన్నారు. మూసీ నదిని ప్రక్షాళన చేసి తీరుతామని, డ్రగ్స్ తీసుకుంటే ఏ కీలుకు ఆ కీలు తీస్తామని సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా హెచ్చరించారు.

# మనసున్న మనిషి.. మానవీయ పథకాలు



మనసున్న మనిషి, తెలంగాణ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన పేరు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. ఉద్యమ నాయకుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం, పాలనలో కూడా అదే స్థాయి ప్రభావాన్ని చూపిందా? అంటే..నూటికి నూరుపాళ్లు అవుననే సమాధానమే వస్తున్నది. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాన్ని కేవలం మాటల్లోనే కాకుండా, అమల్లో చూపించాలని సంకల్పించి అందుకు ఫలితాలు సాధించారు. పిల్లల నుంచి పండు ముదుసలి వరకు, రైతు నుంచి ఉద్యోగి వరకు, ప్రతి వర్గానికీ చేరేలా సంక్షేమ పథకాలను రూపొందించి, కొత్త గవర్నెన్స్ మాడల్‌ను తీసుకొచ్చారు. పాలన అంటే కేవలం అభివృద్ధి, ప్రాజెక్టులు కాదు, ప్రతి కుటుంబానికి భరోసా ఇవ్వటం కూడా ముఖ్యమని భావించిన కేసీఆర్ ముందుకు వచ్చారు. ఆ ఆలోచనల ఫలితంగానే సంక్షేమ పథకాల విస్తరణ చేపట్టి, సక్సెస్ అయ్యారు.తెలంగాణ వార్తలు గర్భిణులకు ఆరోగ్య భద్రత కల్పించటంతో పాటు, పుట్టిన శిశువుకు అవసరమైన మొదటి సంరక్షణ అందించాలనే ఉద్దేశంతో 2017లో కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద గర్భిణులకు సుమారు రూ.12 వేల నుంచి 13 వేల వరకు ఆర్థిక సహాయం అందించటంతో పాటు 16కు పైగా అవసరమైన వస్తువులు అందించారు. ఈ పథకం ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీలు గణనీయంగా పెరిగాయి. లక్షలాది తల్లులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. కేసీఆర్ హయాంలో వెయ్యికి పైగా రెసిడెన్షియల్ గురుకులాలను ఏర్పాటు చేశారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావిధానాన్ని మెరుగుపరిచారు. ఈ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. రైతు బంధు, రైతు బీమా పథకాలు కేసీఆర్ మానవీయ పాలనకు నిదర్శనాలు. మిషన్ కాకతీయ ద్వారా సుమారు 46,000 చెరువులను పునరుద్ధరించారు. దీంతో భూగర్భ జలాలు పెరగటం, సాగు విస్తీర్ణం పెరగటం వంటి మార్పులు చోటుచేసుకున్నాయి. మిషన్ భగీరథ పథకంతో ప్రతి ఇంటికీ తాగునీరు అందించారు. సమాజంలో బలహీన వర్గాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేసీఆర్ ఆసరా పింఛన్లను పెంచారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకాన్ని ప్రారంభించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అమలు చేయటం దేశంలోనే ప్రత్యేకంగా నిలిచింది. పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు ఇవ్వాలనే లక్ష్యంతో 2014లో టీఎస్-ఐ పాస్ చట్టం అమల్లోకి వచ్చింది. ఈ విధానం ద్వారా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. నిరుద్యోగులకు లక్షల సంఖ్యలో ఉద్యోగావకాశాలు లభించాయి. ఉద్యోగావకాశాల సృష్టి ఆర్థిక అభివృద్ధికి దారితీసింది. సంక్షేమం అనే భావనను కేవలం మాటల్లోనే కాకుండా అమల్లో చూపించిన పాలన కేసీఆర్‌ది. తెలంగాణలో సంక్షేమం ఒక వ్యవస్థగా మారిన కాలం కేసీఆర్ హయాం. అందుకే మనసున్న మనిషి కేసీఆర్ మానవీయమైన పాలన, మహోన్నతమైన పథకాల కోసం ప్రజలు వేయి కండ్లతో ఎదురు చూస్తున్నారు.

# ప్రేమ, ఆశల కలబోతగా 'రమణి కళ్యాణం' టీజర్!




సహజనటి జయసుధ ముఖ్య అతిథిగా హాజరైన 'రమణి కళ్యాణం' చిత్ర టీజర్ లాంచ్ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. సూర్య వశిష్ట, దీప్షిక ప్రధాన పాత్రల్లో విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ ఎమోషనల్ డ్రామాను కైట్స్ క్రియేటివ్స్ బ్యానర్ పై విజయ్ ఆదిరెడ్డి, మనోజ్ చింతిరెడ్డి, శ్రీనాథ్ పసుపులేటి, సంజయ్ వెంపరాల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా టీజర్‌ను విడుదల చేసిన జయసుధ మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని తాను స్వయంగా చూశానని, ఇది ఒక స్వచ్ఛమైన ఫీల్ గుడ్ మూవీ అని ప్రశంసించారు. ఈ మధ్యకాలంలో చిన్న సినిమాల్లో కూడా అద్భుతమైన కథాబలాలు కనిపిస్తున్నాయని, రమణి కళ్యాణం కూడా ఆ కోవకు చెందినదేనని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా హీరో హీరోయిన్ల సహజ నటన, సంగీతం సినిమాకు పెద్ద ఆకర్షణగా నిలుస్తాయని, మే 22న విడుదల కానున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు థియేటర్లలో చూసి ఆదరించాలని కోరారు. హీరో సూర్య వశిష్ట తన అనుభవాలను పంచుకుంటూ, వీల్ చైర్‌కే పరిమితమై నటించడం ఒక సవాల్‌తో కూడిన అనుభవమని, దర్శకుడు విజయ్ ఈ కథను ఎంతో ప్రాణం పెట్టి తెరకెక్కించారని తెలిపారు. హీరోయిన్ దీప్షిక ఇందులో చూపులేని అమ్మాయి పాత్రలో కనిపించనున్నట్లు చెబుతూ, ఈ కథ విన్నప్పుడు కలిగిన ఎమోషన్ సినిమా చూశాక కూడా అంతే బలంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ ఒక కొత్త ఆశను, పాజిటివ్ ఎనర్జీని ఇచ్చే ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌కు బాగా నచ్చుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. దర్శకత్వం వహించిన విజయ్ ఆదిరెడ్డి మాట్లాడుతూ, తన మిత్రుడు రామ్ జగదీష్ అద్భుతమైన మాటలు అందించారని, ఒక మంచి టీమ్ సపోర్ట్‌తో ప్యాషన్ కలిగిన నటీనటులతో ఈ సినిమాను రూపొందించామని వెల్లడించారు. జయసుధ గారు సినిమా చూసి మెచ్చుకోవడం తమ టీమ్ మొత్తానికి ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. నిర్మాత శ్రీనాథ్ పసుపులేటి కూడా సినిమాలోని సంగీతం, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ రెడ్డి, శ్యామల, చైతు జొన్నలగడ్డ వంటి పేరున్న నటులు నటించిన ఈ చిత్రానికి సూరజ్ ఎస్ కురుప్ సంగీతాన్ని, అరవింద్ తిరుకోవెల ఛాయాగ్రహణాన్ని అందించారు. రామ్ జగదీష్ సంభాషణలు, స్క్రీన్ ప్లే సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 22న గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది.



# బాడీ షేమింగ్ పై స్మృతి మంధాన అదిరిపోయే రియాక్షన్!

భారత మహిళా క్రికెట్ స్టార్ స్మృతి మంధాన అంటే మైదానంలో పరుగుల వరద పారించే 'క్లాస్' ప్లేయర్. కానీ, సోషల్ మీడియాలో కొందరు ఆమె ఫిట్‌నెస్‌ను కూడా ట్రోల్ చేయడం విడ్డూరం. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తనపై వచ్చిన బాడీ షేమింగ్ కామెంట్స్‌కు స్మృతి చాలా కూల్‌గా, అంతే స్ట్రాంగ్‌గా సమాధానం ఇచ్చారు. ఒక అథ్లెట్‌గా ఫిట్‌గా ఉండటం గర్వకారణమని చెబుతూ ట్రోలర్ల నోళ్లు మూయించారు. ఆ వివరాలు చూద్దాం.. ట్రోలర్లకు స్మృతి స్వీట్ వార్నింగ్: మహిళా క్రికెటర్లు మైదానంలో ఎంత కష్టపడతారో మనందరికీ తెలిసిందే. అయితే, స్మృతి మంధాన ఒకసారి స్లీవ్‌లెస్ డ్రెస్ వేసుకున్నప్పుడు ఆమె చేతులకు కండలు ఉన్నాయని కొందరు సోషల్ మీడియాలో ఎగతాళి చేశారు. ఇక దీనిపై ఆమె స్పందిస్తూ.. "కండలు ఉండటం తప్పు అన్నట్లుగా నన్ను ట్రోల్ చేశారు, అది చాలా వింతగా అనిపించింది. నిజానికి ఒక అథ్లెట్‌గా లేదా మనిషిగా కండలు కలిగి ఉండటం, ఫిట్‌గా ఉండటం అనేది అత్యుత్తమమైన విషయం" అని గట్టిగా చెప్పారు. జిమ్‌లో కష్టపడేది అందుకే: మనం ఫిట్‌గా, టోన్డ్ బాడీతో ఉండటానికి జిమ్‌లో గంటల కొద్దీ చెమట ఓడుస్తామని స్మృతి గుర్తు చేశారు. "అంత కష్టపడి సంపాదించుకున్న ఫిట్‌నెస్‌ను చూసి గర్వపడాలి కానీ, ఎవరో ఏదో అన్నారని బాధపడకూడదు" అని ఆమె చెప్పుకొచ్చారు. కేవలం ఇక ఆట కోసమే కాకుండా, ఒక మనిషి ఆరోగ్యంగా ఉండటానికి బాడీ ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో ఆమె మాటల్లో స్పష్టమైంది. పదహారేళ్లకే అంతర్జాతీయ ఎంట్రీ: ఇక ముంబైకి చెందిన ఈ స్టార్ ఓపెనర్ ఆటపై మక్కువతో కేవలం 16 ఏళ్ల వయసులోనే ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి అడుగుపెట్టింది. అప్పటి నుంచి ఇప్పటివరకు వెనక్కి తిరిగి చూసుకోలేదు. ప్రత్యర్థి ఎవరైనా సరే, తన బ్యాట్‌తో సమాధానం చెప్పడమే ఆమెకు తెలుసు. ఇక తాజాగా ఆమె సాధిస్తున్న రికార్డులు చూస్తుంటే, మహిళా క్రికెట్‌లో ఆమె ఒక ధృవతారలా కనిపిస్తోంది. మెగ్ లానింగ్ రికార్డుపై కన్ను: ప్రస్తుతం స్మృతి మంధాన అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. అతి పిన్న వయసులో అంతర్జాతీయంగా 7,000 పరుగులు చేసిన రికార్డు ప్రస్తుతం ఆస్ట్రేలియా ప్లేయర్ మెగ్ లానింగ్ పేరిట ఉంది. లానింగ్ 29 ఏళ్ల 13 రోజులకు ఈ ఘనత సాధించగా, స్మృతి ఇప్పుడు ఆ రికార్డును బ్రేక్ చేసే దిశగా దూసుకుపోతున్నారు. ప్రతి మ్యాచ్‌లోనూ పరుగుల వరద పారిస్తూ భారత్‌కు ఎన్నో విజయాలను అందిస్తున్నారు. బాహ్య సౌందర్యం కంటే శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం ముఖ్యమని స్మృతి మంధాన నిరూపించారు. ట్రోలింగ్ చేసేవారిని పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటూ రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నారు. "హనీ ఈజ్ బెస్ట్" అన్నట్లుగా క్రికెట్‌లో "స్మృతి ఈజ్ బెస్ట్" అని ఆమె నిరూపిస్తున్నారు. ఇక ఫిట్‌నెస్‌ను ఎగతాళి చేసే వారికి ఆమె సమాధానం ఒక కనువిప్పు లాంటిది.

# ఇకపై వారిద్దరు ఒకే మాట..ఒకే బాట!




ప్రస్తుతం తమిళ రాజకీయ, సినీ రంగాల్లో సరికొత్త సమీకరణాలు కనిపిస్తున్నాయి. అగ్ర నటుడు విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సినీ పరిశ్రమలోని ప్రముఖులతో ఆయనకు ఉన్న సంబంధాలు చర్చనీయాంశంగా మారాయి. తాజాగా సూపర్ స్టార్ రజనీకాంత్ ముఖ్యమంత్రి విజయ్ గురించి సానుకూలంగా స్పందించడం ఇరు వర్గాల అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ పరిణామం కోలీవుడ్‌లో అగ్ర తారల మధ్య ఉండే పరస్పర గౌరవానికి నిదర్శనంగా నిలుస్తోంది. నేడు మీడియా ప్రతినిధులు ముఖ్యమంత్రి విజయ్ పాలన , రాజకీయ ప్రస్థానం గురించి అడిగిన ప్రశ్నకు రజనీకాంత్ అత్యంత హుందాగా స్పందించారు. విజయ్ తన పట్ల చూపిస్తున్న నిబద్ధతను, ప్రజల కోసం ఆయన పడుతున్న తపనను రజనీ కొనియాడారు. రజనీ కాంత్ వంటి దిగ్గజం, తోటి నటుడు ప్రస్తుత రాజకీయ నాయకుడిపై ఇలాంటి ప్రశంసలు కురిపించడం తమిళ రాజకీయాల్లో సానుకూల వాతావరణాన్ని సృష్టించింది. రజనీకాంత్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి విజయ్ స్పందించి సూపర్ స్టార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రజనీకాంత్ తనపై చూపిన నమ్మకం , అందించిన శుభాకాంక్షలు తనకు మరింత బాధ్యతను గుర్తు చేస్తున్నాయని విజయ్ పేర్కొన్నారు. చలనచిత్ర రంగంలో తనకు సీనియర్ అయిన రజనీకాంత్ నుండి ఇలాంటి మద్దతు దక్కడం తన రాజకీయ ప్రయాణంలో గొప్ప ప్రోత్సాహమని అభి ప్రాయపడ్డారు. ఈ ప్రతిస్పందన ఇద్దరి మధ్య ఉన్న ఆరోగ్యకరమైన అనుబంధాన్ని మరోసారి చాటిచెప్పింది. గతంలో బాక్సాఫీస్ వద్ద రికార్డుల కోసం పోటీ పడిన ఇద్దరు దిగ్గజాలు సామాజిక , రాజకీయ వేదికలపై పరస్పర గౌరవాన్ని ప్రదర్శించడం విశేషం. రజనీకాంత్ అభిమానులు , విజయ్ అభిమానులు సోషల్ మీడియాలో ఈ ప రిణామాన్ని వేడుకలా జరుపుకుంటున్నారు. సినిమాల పరంగా ఇద్దరి మధ్య ఎంతటి పోటీ ఉన్నా? వ్యక్తిగతంగా ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఇద్దరు ఒకే మాటపై ఉండటం విశేషమని విశ్లేషకులు భావిస్తున్నారు. తమిళనాడు రాజకీయాల్లో సినీ గ్లామర్‌కున్న ప్రాధాన్యత అందరికీ తెలిసిందే. రజనీకాంత్ మద్దతు రాజకీయంగా ఎంతో ప్రభావాన్ని చూపుతాయనడంలో సందేహం లేదు. విజయ్ పాలనపై రజనీకాంత్ సంతృప్తి వ్యక్తం చేయడంతో తటస్థ ఓటర్లలో, అభిమానుల్లో విజయ్ పట్ల మరింత సానుకూలత పెరిగే అవకాశం ఉంది. రాబోయే కాలంలో ఇద్దరు దిగ్గజాల మధ్య మరిన్ని చర్చలు జరిగే అవకాశం ఉందనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. విజయ్ - రజనీకాంత్ మధ్య చోటుచేసుకున్న ఆత్మీయ సంభాషణ తమిళనాడులో ఓ కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతోంది. విమర్శల కంటే పరస్పర సహకారం , గౌరవంతో ముందుకు సాగడం ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరం. రజనీకాంత్ తన అనుభవంతో ఇచ్చిన సలహాలు, విజయ్ తన ఉత్సాహంతో చేస్తున్న పనులు కలిసి తమిళనాట ఎలాంటి మార్పులు తెస్తాయో వేచి చూడాలి.

# బన్నీతో సీరత్ కపూర్.. హీరోయిన్ గట్టి క్లాస్ పీకిందిగా!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, బ్యూటీ సీరత్ కపూర్ మధ్య ఉన్న ఫ్రెండ్ షిప్ పై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చలు మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. రీసెంట్ గా బన్నీ పుట్టినరోజు సందర్భంగా సీరత్ షేర్ చేసిన ప్రైవేట్ జెట్ ఫోటోలు, వాటిపై వచ్చిన కామెంట్లు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా ఓ నెటిజన్ చేసిన అసభ్యకర కామెంట్ కు సీరత్ ఇచ్చిన ఘాటు సమాధానం నెట్టింట వైరల్ అవుతోంది. ఇటీవల అల్లు అర్జున్ తన 44వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఆ సందర్భంగా సీరత్ కపూర్ సోషల్ మీడియాలో బన్నీతో కలిసి ప్రైవేట్ జెట్ లో దిగిన కొన్ని అ న్‌సీన్ ఫోటోలను షేర్ చేస్తూ ప్రత్యేకంగా విషెస్ తెలిపింది. "హ్యాపీ బర్త్ డే బన్నీ.. మీరు మీ కళను, సంబంధాలను ఎంతో సహజంగా, హుందాగా బ్యాలెన్స్ చేస్తారు. తెరపై, తెర వెనుక మరిన్ని విజయాలు అందుకోవాలి" అంటూ ఆమె పోస్ట్ చేసింది. చివర్లో లవ్ సింబల్ కూడా యాడ్ చేసింది. అయితే సీరత్ కపూర్ పోస్ట్ పెట్టిన తర్వాత సోషల్ మీడియాలో వీరిద్దరి మధ్య రిలేషన్ ఉందంటూ కొందరు నెటిజన్లు ఊహాగానాలు మొదలుపెట్టారు. తాజాగా సీరత్ తన ఇన్ స్టాగ్రామ్ లో మరో ఫోటో షేర్ చేయగా, ఓ నెటిజన్ లిమిట్స్ క్రాస్ చేసి అల్లు అర్జున్ ప్రాపర్టీ అంటూ కామెంట్ చేశాడు. ఆ కామెంట్ పై ఇప్పుడు సీరత్ ఫుల్ ఫైర్ అయ్యి గట్టి క్లాస్ పీకారు. "చివర్లో హార్ట్ ఎమోజీ పెట్టినంత మాత్రాన మీరు చెప్పిన మాటలు గౌరవప్రదంగా మారిపోవు సార్. ఒక మహిళ ఎప్పటికీ ఎవరి ఆస్తి కాదు. ఆమెకు తనకంటూ వ్యక్తిత్వం, కలలు, స్వరం ఉంటాయి. గౌరవించడం నేర్చుకోండి. కానీ ఇలా ప్రాపర్టీ రైట్స్ ఉన్నట్లు మాట్లాడొద్దు" అంటూ ఆమె స్ట్రాంగ్ రిప్లై ఇచ్చారు. అయితే సీరత్ ఇచ్చిన సమాధానానికి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. మహిళలను వస్తువుల్లా చూడటం సరైంది కాదని, వ్యక్తిగత గౌరవం ప్రతి ఒక్కరికి ఉండాలని ఆమె చెప్పిన విధానం చాలా మందిని ఆకట్టుకుంది. పలువురు నెటిజన్లు కూడా సరైన సమాధానం ఇచ్చారని, ఇలాంటి కామెంట్లకు ఇదే కరెక్ట్ కౌంటర్ అంటూ ఆమెకు సపోర్ట్ చేస్తున్నారు. ఇక అల్లు అర్జున్ అభిమానులు కూడా ఈ వివాదంపై స్పందిస్తున్నారు. కేవలం ఫ్రెండ్లీ పోస్టును తప్పుగా అర్థం చేసుకుని అనవసరమైన రూమర్లు క్రియేట్ చేయడం సరికాదని కామెంట్లు చేస్తున్నారు. సినీ ఇండస్ట్రీలో కూడా వీరిద్దరి మధ్య ఉన్నది మంచి స్నేహమే తప్ప మరేదీ కాదని టాక్ వినిపిస్తోంది. గతంలో కూడా బన్నీ- సీరత్ కలిసి కనిపించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన సందర్భాలు ఉన్నాయి. అయితే సీరత్ కపూర్ 2014లో వచ్చిన రన్ రాజా రన్ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత టైగర్, రాజు గారి గది 2, కృష్ణ అండ్ హిజ్ లీల, భామాకలాపం 2, మనమే వంటి చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె పలు కొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉన్నట్లు సమాచారం.

# సమంత సరికొత్త ఫ్యాషన్ విన్యాసం



స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు తన అద్భుతమైన స్టైలింగ్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. పాపులర్ -ది నాడ్- మ్యాగజైన్ కవర్‌షూట్ కోసం సామ్ ధరించిన సరికొత్త అవుట్‌ఫిట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. ఫ్యాషన్ ప్రపంచంలో సమంత ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉంటుందని ఈ తాజా వీడియో నిరూపిస్తోంది. సామ్ ధరించిన రంగుల ఎంపిక నుండి తన బాడీ లాంగ్వేజ్ వరకు ప్రతిదీ ఎంతో ప్రొఫెషనల్‌గా -ఆకర్షణీయంగా ఉంది. 00:05 / 02:25 ఈ ఫోటోషూట్‌లో ప్రధాన ఆకర్షణ తను ధరించిన -చిలుకాకు పచ్చ- రంగు గౌను. ఈ రంగు సమంత ఛాయకు మరింత గ్లామర్‌ను జోడించింది. దానికి తోడు తన టోన్డ్ థై సొగసును ఎలివేట్ చేసేలా డిజైన్ చేసిన బ్లాక్ మిడీ సమంత రూపాన్ని ఎంతో స్పైసప్ చేసింది. ట్రెడిషనల్ రంగులకు మోడ్రన్ కట్స్ జోడించి సమంత ప్రదర్శించిన ఈ సరికొత్త రూపం ఫ్యాషన్ ప్రియులకు కనువిందు చేస్తోంది. వీడియోలో గాలికి ఎగిరే ఆ చున్నీ ఫోటోషూట్‌కు ఒక డైనమిక్ వైబ్ ని ఇచ్చింది. సాధారణంగా కదలిక లేని ఫోటోల కంటే ఇలా మూవ్‌మెంట్ ఉన్న గ్లింప్స్ ప్రేక్షకులను ఎక్కువగా ఆకట్టుకుంటాయి. సమంత తన పర్ఫెక్ట్ టోన్డ్ బాడీని చూపిస్తూ ఇచ్చిన పోజులు ఫిట్‌నెస్ విషయంలో తన అంకితభావాన్ని చాటిచెబుతున్నాయి. ఈ ఫోటోషూట్‌లోని ప్రతి ఫ్రేమ్ ఏదో ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. మ్యాగజైన్ కవర్‌షూట్‌లు అంటేనే సెలబ్రిటీల వ్యక్తిత్వాన్ని కొత్తగా ఆవిష్కరించేవి. సమంత ది నాడ్ ఫోటో షూట్‌లో కేవలం అందంగా కనిపించడమే కాదు... ఒక పరిపూర్ణమైన ఫ్యాషన్ ఐకాన్‌గా తన ముద్ర వేసింది. సమంత ఫ్యాషన్ సెన్స్ నిజంగానే -మైండ్ బ్లోయింగ్- అనిపించేలా ఉంది. వైవిధ్యమైన దుస్తులను ధరించడంలో ప్రయోగాత్మకత, ధైర్యం, ఆత్మవిశ్వాసం ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఓవరాల్ గా సమంత మరోసారి తన గ్లామర్ పవర్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. కేవలం సినిమాల్లోనే కాకుండా ఇలాంటి హై-ఎండ్ ఫ్యాషన్ షూట్స్‌లో కూడా తనే రాణి అని నిరూపించుకుంది. సమంత ప్రస్తుతం మా ఇంటి బంగారం సినిమా ప్రమోషన్స్ పైనే ఫోకస్ చేసింది. దీనికి కారణం నిర్మాతగాను సత్తా చాటాలనే పట్టుదల.